ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 25 మార్చి 2024 | 5



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమ) సా.6.24
సహరీ (మంగళ) ఉ.4.42

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	34	26

రాజమండ్రి లోక్‌సభకు పురందేశ్వరి



సీనియర్ ఎన్‌టీఆర్ కుమార్తెగా సుపరిచితం

- కూటమి అభ్యర్థిగా ప్రకటించిన బీజేపీ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా తనదైన ముద్ర
- జాతీయ రాజకీయాల్లో రాణిస్తున్న వైనం
- గతంలో కేంద్ర మంత్రిగా చేసిన అనుభవం
- టీడీపీ-జనసేన- బీజేపీ శ్రేణుల్లో జోష్
- త్వరలో రాజమహేంద్రవరానికి రాక

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేరు ఖరారైంది. ఎప్పటి నుంచో ఆమె అభ్యర్థిత్వంపై ప్రచారం ఉన్నప్పటికీ ఆదివారం రాత్రి బీజేపీ జాతీయ నాయకత్వం ఆమె పేరును ఖరారు చేసింది. రాష్ట్రంలో ఆరుగురు లోక్‌సభ అభ్యర్థుల పేర్లు ప్రకటించారు.అందులో పురందేశ్వరి పేరు కూడా ఉంది. ఆమె అభ్యర్థిత్వం ఖరారు కావడంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో జోష్ పెరిగింది. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ నందమూరి తారక రామారావు కుమార్తె కావడం కూటమికి బాగా కలిసి వచ్చే అంశం. అంతేగాక టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి స్వయానా సోదరి. ఎన్టీఆర్ కుటుంబం నుంచి వచ్చిన మహిళా నేతల్లో బాగా రాణిస్తున్న నేత ఆమె.గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన అనుభవం ఆమెకు ఉంది. బీజేపీకి రాష్ట్రంలో తొలి మహిళా అధ్యక్షురాలిగా కూడా ఆమె ఎనలేని పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. ఆమె అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత బీజేపీలో కూడా జోష్‌పెరిగింది. క్యాడర్‌లో కదలిక వచ్చింది. అంతకుముందు నేతలుకేడర్ పట్టించుకోలేదని, కనీసం సొంత అనుచరులను గాలికి వదిలేశారనే అపవాదు ఉంది. అయితే పురందేశ్వరి రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎన్నికైన తరువాత బీజేపీలోని పాత, కొత్తనేతలందరినీ కలుపుకుంటూ ముందుకు వెళుతున్నారు. దానికి తోడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కృషితో టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు కూడా కుదిరింది.దీంతో ఆమెను చారిత్రిక రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా బరిలో దించారు. త్వరలో ఆమె ఇక్కడకు రానున్నా రు.బీజేపీతో పాటు, టీడీపీ, జనసేన క్యాడర్‌ను కలుపుకుని ప్రచారం మొదలు పెట్టనున్నారు. రాజమహేంద్రవరం నుంచి గతంలో బీజేపీ రెండు సార్లు గెలి చిన సంగతి తెలిసిందే. లోక్‌సభకు రెండుసార్లు, అర్బన్ ఎమ్మెల్యే స్థానం నుంచి ఒకసారి గెలిచింది. రెండుసార్లు టీడీపీతో పొత్తు వల్లే గెలిచింది. ఈసారి ఏకంగా టీడీపీ-జనసేన కూడా కలవడంతో బీజేపీ అభ్యర్థికి బాగా బలం పెరిగినట్టు అయింది. ఈ లోక్‌సభ స్థానం గోదావరికి ఇటు ఇటూ ఉన్న ప్రాంతం. ఈ స్థానం టీడీపీకి కంచుకోట. పోల్ మేనేజ్‌మెంట్ వర్గాల సమీకరణ వ్యూహాత్మకంగా ఉంటే టీడీపీ నుంచి ఈ స్థానాన్ని ఎవరూ తన్నుకుపోలేనంత క్యాడర్ టీడీపీకి ఉంది. తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్‌సభ ఎన్నికలలో టీడీపీ మూడుసార్లు, బీజేపీ రెండుసార్లు, కాంగ్రెస్ నాలుగు సార్లు, వైసీపీ ఒకసారి గెలిచాయి. కానీ గెలిచిన ప్రతిసారి ఓట్లశాతం పరిశీలించినా, మెజార్టీ శాతం పరిశీలించినా టీడీపీయే అధికంగా ఓట్లు తెచ్చుకోవడం గమనార్హం. రాష్ట్ర విభజన తర్వాత మొదటగా జరిగిన 2014లో జరిగిన ఎన్నికల్లో రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి సినీనటుడు మాగంటి మురళీమోహన్ ఘన విజయం సాధించారు. అప్పట్లో 6,30,573 ఓట్లు అంటే 54.62 శాతం ఓట్లు సాధించారు. అంతకు ముందు జరిగిన ఎన్నికల కంటే అదనంగా 19.72 శాతం సాధించారు. ఇంత వరకూ ఎవరికీ రానంత మెజార్టీ ఆయనకు వచ్చింది. ఏకంగా 1,67,434 ఓట్ల మెజార్టీ లభించింది. ఇది 14.29 శాతం మెజార్టీ. అప్పట్లో వైసీపీ తరఫున పోటీ చేసిన బొడ్డు వెంకటరమణ చౌదరికి 4,63,139 ఓట్లు వచ్చాయి. అది 40.12 శాతం.

కానీ 2019లో తెలుగుదేశం, జనసేన వేర్వేరుగా పోటీచేసి దెబ్బతిన్నాయి. టీడీపీ తరఫున మాగంటి మురళీమోహన్ కోడలు మాగంటి రూప పోటీ చేసి 4,60,390 ఓట్లు అంటే 36.82 శాతం తెచ్చుకోగలిగారు. జనసేన అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ పోటీ చేసి 1,55,807 ఓట్లు అంటే 12.46 శాతం సాధించారు. ఈ ఇద్దరి మధ్య ఓట్లు చీలిపోవడంతో వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్ 5,82,024 ఓట్లు అంటే 46.55 శాతం ఓట్లు సాధించి 1,21,634 ఓట్లు మెజా ర్టీ సాధించారు. ఇది 9.73 శాతం మెజార్టీ.. ఈసారి ఈ లెక్కలే కాక, అధికార పార్టీ మీద ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, టీడీపీ ,జనసేన, బీజేపీ ఐక్యత వల్ల ఉమ్మడి అభ్యర్థి బలమే ఎక్కువ ఉంటుంది. ఇక్కడ నుంచి వైసీపీ అభ్యర్థిగా డా.గూడూరి శ్రీనివాసరావు బరిలో ఉన్న సంగతి తెలిసిందే. ఇక్కడ ద్విముఖ పోటీనే ఉంటుంది. ఈ లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ నేతలు చాలా మంది ఆశపెట్టుకున్నారు. రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఇక్కడ టికెట్ ఆశించారు. రాజానగరం టికెట్ ఇస్తానని మొదట్లో టీడీపీ అధిష్ఠానం ఆయనకు హామీ ఇచ్చింది. పొత్తులో అది జనసేనకు కేటాయించడంతో చివరకు లోక్‌సభ స్థానం నుంచి అవకాశం ఉంటుందనే ప్రచారం జరిగింది. 2014లో ఆయన వైసీపీ అభ్యర్థిగా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఇంకా మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్, శిష్టా లోహిత్, గన్ని కృష్ణ, పార్టీ సమన్వయకర్త వై.రవి, వంటి వారు టికెట్ ఆశించారు. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు వల్ల కూటమి అభ్యర్థిగా పురందేశ్వరి అభ్యర్థిత్వం ఖరారు కావడంతో మూడు పార్టీల్లోనూ జోష్ పెరిగింది.

ప్రింటింగ్ ప్రెస్‌లు ఎన్నికల నియమావళి పాటించాలి

కలెక్టర్ హిమాన్షు శుక్లా



అమలాపురం టౌన్, మార్చి 24: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున జిల్లాలోని వివిధ రకాల ముద్రణా సంస్థలు, కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ప్రింటింగ్ విషయంలో నిబంధనలు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని 127(ఎ) ప్రకారం కరపత్రాలు, పోస్టర్లు ముద్రించినప్పుడు వాటిపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లు,చిరునామా స్పష్టంగా ఉండాలన్నారు. పబ్లిషర్ చిరునామా కాపీలు రెండింటిని, ముద్రించిన కాపీలను వెంటనే జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి తప్పనిసరిగా అందజేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే ప్రింటింగ్ ప్రెస్‌ల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

రేపటి నుంచి ఇంటర్ నాలుగో విడత మూల్యాంకనం

అమలాపురం టౌన్, మార్చి 24: అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షా పత్రాల మూల్యాంకనం జరుగుతోందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఇందులో భాగంగా నాల్గో విడత మంగళవారం నుంచి చరిత్ర, రసాయన శాస్త్ర పరీక్షా పత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుందన్నారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ నియమించిన అసిస్టెంట్ ఎగ్జామినర్స్, చీఫ్ ఎగ్జామినర్స్, స్క్రూటినైజర్లు తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని సోమశేఖరరావు కోరారు. ఏప్రిల్ 3న మూల్యాంకనాన్ని ముగించాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. విధులకు నిర్దేశించిన వారిని ఆయా కళాశాలలు రిలీవ్ చేసి స్పాట్ వాల్యూయేషన్‌కు పంపించాలన్నారు. స్క్రూటినైజర్లను 26న రిలీవ్ చేసి 27వ తేదీ విధులకు హాజరయ్యేలా చూడాలని కోరారు.

కోడ్ కూస్తున్నా...

కల్యాణోత్సవాలకు ముహూర్తపు రాట



అమలాపురం టౌన్, మార్చి 24: అమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా దేవస్థానం చైర్‌పర్సన్ దూడల విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు ఆదివారం ముహూర్తపు రాట పాతారు. అయితే ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని పలువురు వ్యాఖ్యానించారు. ఈ విషయమై దేవదాయ శాఖ జిల్లా అధికారి డి.నాగమల్లేశ్వరరావును వివరణ కోరగా... స్వామివారి కల్యాణోత్సవాలను అధికారులే అధికారికంగా నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. కోడ్ అమలులో ఉన్నందున భక్తులు మాదిరిగానే దేవస్థానం పాలకవర్గం ఉంటుందన్నారు.

రోడ్డు నిర్మించారు.. బెర్మ్ మరిచారు

ప్రమాదభరితంగా ముక్కామల-వక్కలంక రహదారి



ముక్కామల వద్ద ప్రమాదభరితంగా ఉన్న రహదారి

అంబాజీపేట, మార్చి 24: మండలంలోని ముక్కామల లాకుల నుంచి వక్కలంక మీదుగా మడుపల్లి వరకు నిర్మించిన రహదారి ప్రమాదభరితంగా మారింది. ముక్కామల ప్రధాన పంట కాలువ వెంబడి రహదారి కుంగిపోవడంతో జారిపడే అవకాశముందని వాహనచోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ రోడ్ ఫండ్ నిధులు సుమారు రూ.6 కోట్లతో ముక్కామల నుంచి సుమారు 4 కిలోమీటర్లు మేర బీటీ రోడ్డు నిర్మించారు. అయితే బెర్మ్ ఏర్పాటు చేయకపోవడంతో రహదారి కుంగిపోతోంది. ఇరిగేషన్ అధికారులు ఇటీవల పంట కాలువ పనులు చేపట్టారు. అయితే రోడ్డు ఒక పక్కకు జారుతుండడంతో ప్రయాణం ప్రమాదభరితంగా మారిందని ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.



రోడ్డు దిగబడిన చోట బెర్మ్ వేయకుండా క్లాత్ కట్టిన దృశ్యం

ఉమ్మడి అభ్యర్థులను గెలిపిస్తాం

రాజోలు నియోజకవర్గ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నేతలు

మలికిపురం, మార్చి 24: టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను విజయపథంలో నడిపించడానికి టీడీపీ కార్యకర్తలు ప్రాణత్యాగానికైనా సిద్ధమని మండలంలోని లక్కవరంలో ఆదివారం జరిగిన ఆ పార్టీ రాజోలు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పలువురు వక్తలు అన్నారు. పార్టీ కోసం గత ఐదేళ్లుగా ఎన్నో త్యాగాలు చేశామని, అభ్యర్థుల విజయానికి ఇప్పుడు కూడా ముందుంటామన్నారు. రాజోలు అసెంబ్లీ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ఎవరో వస్తారని ఎదరు చూడకుండా ముందుకు వెళ్లాలని, మోసాలను అరికట్టాలని పిలుపునిచ్చారు. కండువాలు మార్చేవాళ్లను సాగనంపుదామని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతానికి ఎంతో సేవ చేయాలనే దృక్పథంతోనే తాను రాజకీయాల్లో వచ్చానన్నారు. కోనసీమలో రైలు కూత త్వరలో విందామన్నారు. ఈ ప్రాంతంలో తాగునీరు, సాగునీరు, ఉద్యోగాల కొరతతో రైతులు, ప్రజలు అల్లాడుతున్నారని, జీవన భృతి కోసం గల్ఫ్ వెళ్లేవారికి రక్షణ లేకుండా పోతోందన్నారు. తాను పలు పథకాలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ భద్రత కల్పిస్తానన్నారు. టీడీపీ హయాంలో 'చంద్రన్న బీమా' పథకాన్ని తానే రూపకల్పన చేశానన్నారు. టీడీపీ అంటే తనకు అపారమైన గౌరవమని, మీ సహకారం, మీ త్యాగాలు, మీ క్రమశిక్షణ గురించి తనకు తెలుసన్నారు. త్వరలోనే సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసుకుందామన్నారు. పోల్ మేనేజ్‌మెంటు, ఓటర్లను కలవడం తదితర అంశాల్లో మండల కమిటీల సమక్షంలో ఉమ్మడిగా ముందుకు వెళ్దామన్నారు.

మరో ముఖ్య అతిథి, అమలాపురం లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ తన తండ్రి ఏ విధమైన అభివృద్ధి చేసి ప్రజల మదిలో నిలిచారో తాను కూడా ఆ విధంగా పనిచేసి మీ అందరి మెప్పు పొందుతానన్నారు. రాబోయే రోజుల్లో అన్ని గ్రామాలకు వెళ్లి ఓటర్లను కలుస్తానన్నారు. టీడీపీ, జన సేన కార్యకర్తలు సమన్వయంతో మేనిఫెస్టోలోని అంశాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. కోనసీమలో రైలు కూత వినడానికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ కార్యకర్తలకు భవిష్యత్తులో తగు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు అభ్యర్థి వర ప్రసాద్‌ను కోరారు.

సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, రుద్రరాజు వెంకట్రామరాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, గుబ్బల శ్రీనివాస్, మొల్లేటి శ్రీనివాస్, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, మంగెన భూదేవి, చాగంటి స్వామి, ఈలి శ్రీనివాస్, మంగెన రాధాకృష్ణ, వర్ధినీడి బాబ్జీ, మంగెన భూదేవి, బోళ్ల వెంకటరమణ, చెల్లుబోయిన శ్రీను, గెడ్డం సింహ, చెల్లుబోయిన హెలీన, బందెల పద్మ, కాండ్రేగుల భవానీలావణ్య, మోకా పార్వతి, చెల్లింగి సత్యనారాయణ, చింతా వీరభద్రేశ్వరరావు, పప్పుల రమేష్, మంగెన నాని తదితరులు పాల్గొన్నారు.





టీడీపీ రాజోలు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న అమలాపురం లోక్‌సభ అభ్యర్థి హరీష్‌మాధుర్, రాజోలు అసెంబ్లీ అభ్యర్థి వరప్రసాద్





మంగళగిరిలో పవన్‌కల్యాణ్, నాగేంద్రబాబులతో బాలకృష్ణ

ఉన్నత స్థాయి పదవి ఇస్తాం

- పితాని బాలకృష్ణకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భరోసా!

ముమ్మిడివరం, మార్చి 24: టిక్కెట్ ఆశించి భంగపడిన ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం చర్చలు జరిపారు. పొత్తులో భాగంగా ఎక్కడో ఒకచోట తమకు టిక్కెట్ లభిస్తుందని చివరి నిమిషం వరకు వేచి చూసినా దక్కకపోవడంతో అసంతృప్తితో ఉన్నవారితో పవన్‌కల్యాణ్, నాగేంద్రబాబు, నాదెండ్ల మనోహర్ ఆదివారం పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. పితాని బాలకృష్ణ 2019లో ముమ్మిడివరం అసెంబ్లీ స్థానం నుంచి జనసేన తరఫున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అప్పటి నుంచీ ఆయన పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ వచ్చారు. ఈసారి ఎన్నికల్లో అభ్యర్థిత్వం తనకే లభిస్తుందని ధీమాగా వున్నా పొత్తులో భాగంగా టీడీపీకి చెందిన దాట్ల బుచ్చిబాబుకు లభించింది. దీంతో బాలకృష్ణ మనస్తాపానికి గురయ్యారు. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి అయినా బాలకృష్ణకు టిక్కెట్ కేటాయించాలని జనసేనకు చెందిన కొందరు ఆ పార్టీ అధి ష్ఠానంపై ఒత్తిడి తెచ్చారు. అయితే అక్కడా సీటు లభించకపోవడంతో బాలకృష్ణ, ఆయన వర్గీయులు మరింత మనస్తాపానికి గురయ్యారు. ఉమ్మడి అభ్యర్థి ప్రచారం నియోజకవర్గంలో చురుగ్గా సాగుతున్నా దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణను ఆదివారం మంగళగిరిలో పార్టీ కార్యాలయానికి రప్పించి పవన్‌కల్యాణ్ మాట్లాడారు. రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మీరు ఆశించిన దానికన్నా ఉన్నత స్థాయి పదవిని కల్పిస్తామని పవన్‌కల్యాణ్ భరోసా ఇచ్చినట్టు సమాచారం. దీంతో బాలకృష్ణ, ఆయన అనుచరుల్లో అసంతృప్తి తొలగినట్టు తెలుస్తోంది.

లక్ష్మీనరసింహుని చక్రతీర్థం


చక్రస్నానం

కోరుకొండ, మార్చి 24:

కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం దేవుని కోనేటి వద్ద చక్ర పెరుమాళ్లకు నరసింహస్వామి, అనంత పద్మనాభస్వామి సమక్షంలో చక్రతీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యుల బ్రహ్మత్వంలో అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్ పర్యవేక్షణలో ఆలయ అనువంశిక అర్చకస్వాములు, చక్రపెరుమాళ్లకు పంచామృతాలతో అభిషేకం చేశారు. అంతకు ముందు స్వామి దిగువ దేవస్థానంలో ప్రత్యేక సేవా కాలం నిర్వహించి నరసింహ, పద్మనాభ స్వాములను చెరో పల్లకిలో ఆశీనులు చేసి మేళతాళాలు, మంత్రోచ్ఛారణలతో దేవుని కోనేటి వద్దకు తీసుకుని వచ్చారు. అనంతరం అక్కడ చక్రపెరుమాళ్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి కోనేటిలో చక్రతీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు చక్రస్నానాలు ఆచరించారు. తదుపరి స్వామివార్లు ఆలయానికి చేరుకున్నారు.


కోనేరు వద్దకు పల్లకిలో వెళ్తున్న స్వామివారు

ఊయల సేవ

నరసన్న కల్యాణోత్సవాలు చివరి రోజు ఆదివారం రాత్రి స్వామివారి ఆలయ మండపంలో ప్రత్యేక ఊంజలసేవ (ఊయల సేవ) నిర్వహించారు. ఇందుకోసం స్వామి కల్యాణ మండపాన్ని వివిధ రకాల పండ్లతో అలంకరించారు. కల్యాణ వేదికపై ఊయలలో ఆశీనులైన నరసింహ స్వామిని ఎదురుగా ఉన్న పెద్ద అద్దంలో భక్తులు దర్శించుకున్నారు. లక్ష్మీనరసింహస్వామికి కోరుకొండ నాలుగు మాఢవీధుల్లో శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు స్వామి వారిని చివరిసారిగా దర్శించుకుని మంగళ నీరాజనాలు అందజేశారు.


చక్రపెరుమాళ్లకు పంచామృత అభిషేకాలు

ముగిసిన ఉత్సవాలు

నరసింహస్వామి కల్యాణోత్సవాలు (బ్రహ్మోత్సవాలు) ఆదివారం అర్ధరాత్రితో వైభవంగా ముగిశాయి. అంతకుముందు స్వామి వారి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. చివరి ధ్వజాన్ని అవరోహణం చేయడం ద్వారా ఉత్సవాలు శాస్త్రోక్తంగా పరిసమాప్తమయ్యాయి.

ముగిసిన పండిత సభలు

నరసన్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో ఐదు రోజులుగా జరుగుతున్న 92వ పండిత సభలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఎందరో పండితులు ఈ ఆధ్యాత్మిక సభల్లో పాల్గొని భారత, భాగవత, రామాయణ, ఇతిహాసాల్లోని అనేక విషయాలను, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, ఆళ్వారులు ప్రబంధంలోని అనేక భగవత్ విషయాలను వివరించారు. ముగింపు సందర్భంగా సభల్లో పాల్గొన్న పండితులందరినీ ఘనంగా సత్కరించారు. అలాగే బ్రహ్మోత్సవాల సందర్భంగా కోరుకొండకు వచ్చిన భక్తులకు స్థానిక మిరియాల వెంటరెడ్డి పంతులు ధర్మసత్రంలో ఉచిత నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు సెలవు దినం(ఆదివారం) కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. సుమారు 50 వేల మందికి పైగా అన్నప్రసాదం అందించినట్టు సత్రం ఈవో పాటి సత్యనారాయణ తెలిపారు. ఈ గ్రామోత్సవంలో పరాసర లక్ష్మీనరసింహభట్టర్, పరాసర రంగరాజభట్టర్, పరాసర రఘునాథ భట్టర్, పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశిక అర్చక స్వాములు పాల్గొన్నారు.



కిటకిటలాడిన లోవ





- మొక్కుబడులు తీర్చుకున్న భక్తులు
- ఆరుబయట సహపంక్తి భోజనాలు

తుని రూరల్, మార్చి24: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామునే తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా లోవకు తరలి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటావార్పులు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో విశ్వనాథరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తుల రాకతో లోవ ప్రాంగణం సందడిగా మారింది. దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది.

సంత్రాగచ్చి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు



సామర్లకోట, మార్చి 24: హోలీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సంత్రాగచ్చి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక హోలీ ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 25న నడపనున్నట్లు విజయవాడ సీనియర్ డీవోఎం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 07646 నంబరు గల సంత్రాగచ్చి-సికింద్రాబాద్ రైలు ఆదివారం తెల్లవారుజామున 5.45 గంటలకు సంత్రాగచ్చి స్టేషన్‌లో బయలుదేరుతుంది. ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, జాజీపూర్ కియోంజాహార రోడ్, కటక్, భువనేశ్వర్, ఖుర్దారోడ్, బెరహంపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, సింహాచలం, దువ్వాడ అనకాపల్లి మీదుగా సామర్లకోటకు సోమవారం రాత్రి 10.58కు చేరుతుంది. రాజమండ్రికి రాత్రి 9.43 గంటలకు చేరి తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా విజయవాడకు అర్ధరాత్రి 1.10 గంటలకు చేరుతుంది. గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు మంగళవారం ఉదయం 8.10 గంటలకు చేరుతుంది. 24 బోగీలతో వివిధ తరగతులకు చెందిన ప్రయాణికులను తమతమ గమ్యస్థానాలకు చేర్చేందుకు 3,500 కిలోమీటర్ల దూరాన్ని 26 స్టాపులతో 96 గంటలలో చేరుతుందని రైల్వే అధికారులు చెప్పారు. మరిన్ని వివరాలకు, రిజర్వేషన్లకు సమీప రైల్వే స్టేషన్‌లోని బుకింగ్ కార్యాలయాన్ని సంప్రదించాలని రైల్వే సీనియర్ డీవోఎం సూచించారు.

ఆర్అండ్‌బీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పాపారావు


పాపారావును అభినందిస్తున్న సూర్యనారాయణ తదితరులు

కాకినాడ సిటీ, మార్చి 24: ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కాకినాడ జిల్లాకు చెందిన చెల్లుబాని పాపారావు నియమితులయ్యారు. మంగళగిరిలో జరిగిన సమావేశంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల సహాయంతో పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. పాపారావుకు పలువురు ఉద్యోగులు అభినందనలు తెలిపి సత్కరించారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం


దాతకు స్వామివారి చిత్రపటం బహూకరణ

ఆత్రేయపురం, మార్చి 24: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి హైదరాబాద్ చంపాపేట్‌కు చెందిన వత్సవాయి సాయి రూ.లక్ష విరాళం సమర్పించారు. దాతకు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా ఆదివారం ఒక్కరోజు ఆదాయం రూ.3,02,619 లభించినట్టు ఈవో చెప్పారు.

అత్తపై అల్లుడి దాడి

- తెగిపోయిన చేతివేలు, తలపైనా గాయాలు
- కాకినాడ జీజీహెచ్‌కు తరలింపు



బిక్కవోలు, మార్చి 24: కూతురు, మనవలను తీసుకెళ్లిపోవాలని చెప్పిన కారణంగా అత్తపై అల్లుడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బిక్కవోలు మండలం ఇళ్లపల్లిపాకలు గ్రామంలో ఈ సంఘటన ఆదివారం జరిగింది. ఎస్ఐ పి.బుజ్జిబాబు అందించిన వివరాల ప్రకారం.. యానాంకు చెందిన గీసాల దుర్గా మోహన్‌కు 2013లో ఇళ్లపల్లిపాకలుకు చెందిన వాసంశెట్టి లోవకుమారితో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. మోహన్ తరచూ మద్యం తాగొచ్చి భార్యను కొడుతుండడంతో ఆమె అమ్మగారి ఇంటి వద్దకు వచ్చేసింది. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసు కోర్టు పరిధిలో ఉంది. ఆదివారం ఇళ్లపల్లిపాకలు వచ్చిన మోహన్‌ను తన కూతురు, మనవలను ఎందుకు తీసుకు వెళ్లడం లేదంటూ అత్త మంగ నిలదీసింది. దీంతో మాటా,మాటా పెరిగి గొడవ పడి అక్కడ ఉన్న కత్తిపీటతో మంగ తలపై దాడి చేశాడు. ఆమె చెయ్యి అడ్డుపెట్టుకోవడంతో ఆమె కుడి చేయి ఉంగరం వేలు చివరి భాగం తెగిపోయింది. తలపై నాలుగు చోట్ల బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆమెను స్థానికులు అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

భార్య ఎడబాటును తట్టుకోలేక ఆత్మహత్య

అనపర్తి, మార్చి 24: భార్య ఎడబాటును తట్టుకోలేక అనపర్తి మండలం కుతుకులూరులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రామారావు వివరాల ప్రకారం.. కుతుకులూరులోని కూటేశ్వర కాలనీకి చెందిన మండ వీర వెంకట సత్యనారాయణరెడ్డి(38)కి 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో కొంతకాలంగా విడివిడిగా ఉంటున్నారు. సత్యనారాయణరెడ్డి తన తల్లి వద్ద ఉంటున్నాడు. భార్య ఎడబాటును తట్టుకోలేని ఆయన ఆదివారం గ్రామంలోని వాటర్ ట్యాంక్ నుంచి కిందకు దూకాడు. తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష

అన్నవరం, మార్చి 24: రత్నగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఒక దాత రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. చెల్లూరుకు చెందిన బల్ల కోటి ప్రసాద్ ఈ మొత్తాన్ని ఆలయ అధికారులకు అందజేయగా వారిని అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

రంపచోడవరం, మార్చి 24: ఏజెన్సీలో గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు మడకం జోగమ్మ అన్నారు. మార్క్స్-ఏంగిల్స్ భవనంలో ఆదివారం ఆమె ఆధ్యక్షతన డివిజన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.అనసూయ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే నాయకులను ఎన్నుకోవాలని, కోరారు. సర్పంచ్ పల్లాల ఆదిలక్ష్మి, పీవోడబ్ల్యూ నాయకులు సాదల చిలకమ్మ, కానెం లక్ష్మి, బాపనమ్మ, కొమరం రాములమ్మ, కోటం సత్యవతి పాల్గొన్నారు.

అరకు ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీత



రంపచోడవరం మార్చి 24: అరకు పార్లమెంట్ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఖరారయ్యారు. ఈ మేరకు బీజేపీ ప్రకటన వెలువరించింది. 2014-2019 మధ్య కాలంలో వైసీపీ నుంచి ఎంపీగా ఎన్నికైన గీత అప్పట్లో వైసీపీని వ్యతిరేకించి కేంద్రంలో బీజేపీతోను, రాష్ట్రంలో టీడీపీతోను సన్నిహితంగా మెలిగారు. అనంతరం ఓ పార్టీని స్థాపించిన గీత కొద్ది కాలానికి ఆ పార్టీని బీజేపీలో విలీనం చేశారు. కొత్తపల్లి గీత బీజేపీ అరకు అభ్యర్థిగా వస్తారని కొన్ని నెలలుగా ప్రచారం జరుగుతోంది. ఆమె ఏడు సెగ్మెంట్లలో చాలా కాలం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వస్తున్నారు.

ఈవీఎంల వినియోగం ఎప్పటి నుంచి అంటే..



సామర్లకోట, మార్చి 24: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. తమకు ఇష్టమైన నాయకులను ఎన్నుకునేందుకు అవకాశం ఉంటుంది. అటువంటి ఓటును కొందరు దుర్వినియోగం చేసుకుంటే మరి కొంత మంది వినియోగించుకోవడంలోనూ తడబాటు పడుతున్నారు. ఇటీవల కాలంలో ఓట్ల గల్లంతు అనేది ప్రధానంగా మారింది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఒకరి ఓట్లు వేరొకరు తొలగించుకునే వరకూ వచ్చింది. ఓటును రక్షించుకునేందుకే ఓటర్లు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఇటువంటి పరిస్థితి లేదు. ఓటు తొలగించాలంటే మాన్యువల్‌గా మాత్రమే దరఖాస్తులు చేసి విచారణ చేసిన తర్వాతనే ఓట్లు తొలగింపు జరిగేది. బ్యాలెట్ పేపర్ ద్వారా ఓట్లు వేసుకునే అవకాశం ఉండేది. ఓటు లెక్కింపునకు రోజులు పట్టేవి. ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)లదే పైచేయిగా మారింది. అయితే ఇవి ఎప్పటినుంచి అందుబాటులోకి వచ్చాయనే విషయం చాల మందికి తెలియదు.

మొదటి వినియోగం

ఈవీఎం విధానం వచ్చిన తర్వాత ఎన్నికల నిర్వహణ, లెక్కింపు సులభమైంది. ఈ పరికరం సుమారు 40 ఏళ్ల కిందటే అందుబాటులోకి వచ్చింది. 1982 మే 19న కేరళలోని పారూర్ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా వినియోగించారు. మంచి ఫలితాలు రావడంతో 1982, 83 సంవత్సరాలలో దేశంలో జరిగిన పలు ఉప ఎన్నికలలో వినియోగించారు. అప్పటి నుంచి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగిస్తున్నారు. ఈవీఎంల తయారీ హైదరాబాద్‌లోనే జరిగేది. ఈవీఎంలను పలు రాజకీయ పార్టీలు గతంలోనే వ్యతిరేకించాయి. ఈ నేపథ్యంలోనే 1984 మే 5న సుప్రీంకోర్టు ఈవీ ఎంలను వినియోగించొద్దు అంటూ తీర్పు వెలువరించింది. 1988 డిసెంబరుతో కేంద్రప్రభుత్వం సెక్షన్ 61(ఏ) ద్వారా ప్రజా ప్రాతినిధ్య చట్టం పరిధిలో ఈవీఎంల వినియోగం అంశాన్ని చేర్చారు. 1989 మార్చి 15న సవరించడంతో సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. 1990 జనవరిలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్నికల సంస్కరణలు కమిటీ ఈవీఎంలను సమర్థించింది. 1992 మార్చి 24న ఎన్నికల నియమావళి 1961ని సవరించి, ఆధీకృతం చేయడంతో 1998లో ప్రజామోదం లభించింది. 1998 ఎన్నికలలో పూర్తిస్థాయిలో ఈవీఎంల వినియోగం జరగకపోయినా 2004లో నిర్వహించిన ఎన్నికల నుంచి దేశవ్యాప్తంగా పూర్తిగా పేపర్ వాడకం మాని ఈవీఎంలనే వాడుతున్నారు. ఇటీవల కాలంలో ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతున్నాయనే అనుమానాలు పలు రాజకీయ పార్టీలు లేవనెత్తాయి. తిరిగి బ్యాలెట్ పేపర్ విధానాన్నే అమలు చేయాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చాయి. భారత ఎన్నికల కమిషన్ మాత్రం ఈవీఎంల వలన ఎటువంటి ట్యాంపరింగ్ జరగడం లేదని పారదర్శకంగానే ఎన్నికలు జరుగుతున్నాయని ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. ఇందులో భాగంగానే వీవీ ప్యాట్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఒక్కో ఈవీఎంలో ఎన్ని ఓట్లు..

ఒక్క పోలింగ్ బూత్‌లో 1900 మంది వరకూ మాత్రమే ఓట్లు వేసేందుకు అవకాశం కల్పించింది. 1900 దాటిన ఓటర్లు ఉంటే రెండో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని ఎన్నిక సంఘమే ఆదేశాలు జారీ చేసింది. ఒక ఈవీఎంలో 2000 వరకే ఓట్లు వేసుకునేందుకు అవకాశం ఉంది. ఒక్క పోలింగ్ బూత్‌కు ఒక ఈవీఎం ఇస్తారు. ప్రతీ ఈవీఎంలోనూ బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ వీవీ ప్యాట్‌కు అనుసంధానం చేసి ఉంటాయి. కంట్రోల్ యూనిట్ పోలింగ్ అధికారి వద్ద ఉంటుంది. ఓటరుకు ఓటు ఇవ్వాలా, వద్దా అనే విషయాన్ని నిర్ధారించుకున్న తర్వాత బ్యాలెట్ యూనిట్‌లోని తనకు నచ్చిన పార్టీ అభ్యర్థికి ఓటు వేసేందుకు తన ఎదురుగా ఉన్న బటన్ నొక్కితే ఓటు నమోదు అవుతుంది. తాము ఎవరికి ఓటు వేశామో తెలుసుకునేందుకు వీవీ ప్యాట్‌లో డిస్‌ప్లే అవుతుంది.

వీవీ ప్యాట్‌లతో ఓటు నిర్ధారణ

ఎన్నికలలో పారదర్శకత పెంచడంతో పాటు ఓటర్ల నమ్మకాన్ని చూరగొనేందుకు ఎన్నికల సంఘం 2013 ఆగస్టు 14న ఈవీఎంలకు వీవీ ప్యాట్‌లను అనుసంధానం చేసింది. వీవీ ప్యాట్ అంటే ఓటరు వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్. ఓటు నిర్ధారణ యంత్రం అని అర్థం. నాగాలాండ్ రాష్ట్రం నాక్సెన్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటి సారిగా 2013 సెప్టెంబరు 4న ప్రయోగాత్మకంగా వినియోగించింది. వీవీ ప్యాట్‌లను దశలవారీగా అన్ని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం 2017 ఏప్రిల్‌లో వీవీ ప్యాట్ల కొనుగోలుకు కూడా ఆమోదం తెలిపింది.

కాంతిమయంగా నిర్మలగిరి



అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

దేవరపల్లి, మార్చి 24: నిర్మలగిరి మేరీమాత మహోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజైన ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు మేరీ మాతను దర్శించుకున్నారు. వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చి మేరీమాతను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. మెట్ల మార్గం ద్వారా ప్రధాన ఆలయానికి మోకాళ్లపై ఎక్కి ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. మేరీమాత స్వరూపం వద్ద కొబ్బరికాయలు కొట్టి కొవ్వొత్తులు వెలిగించారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ జాన్‌పీటర్ భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. దివ్యబలి పూజలు, పవిత్రాత్మ స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు. భక్తుల రాకతో ప్రాంగణం సందడిగా మారింది


తరలివచ్చిన భక్తులు

త్వరలో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటిస్తాం

అంతర్వేది, మార్చి 24: పార్లమెంటు, శాసనసభ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటిస్తారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రుద్రరాజు గోపాలకృష్ణరాజు తెలిపారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక్కొక్క అసెంబ్లీకి 5 నుంచి 10మంది వరకు దరఖాస్తు చేసుకున్నారని, వైఎస్ షర్మిల పీసీసీ పగ్గాలు చేపట్టిన తరువాత పార్టీబలపడిందన్నారు.పార్టీ ఎవరికి టిక్కెట్ ఇచ్చినా అందరూ అభ్యర్థి విజయానికి కృషిచేయాలన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



అంతర్వేది: ప్రత్యేక గీతాలాపనలు చేస్తున్న క్రైస్తవులు

అమలాపురం టౌన్, మార్చి 24: బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో రెవరెండ్ జి.సత్యప్రసాద్ పర్యవేక్షణలో క్రైస్తవ విశ్వాసులు మట్టల ఆదివారం ర్యాలీ నిర్వహించారు. బి.సావరంలోని బేతని ప్రార్థనా మందిరం వద్ద నుంచి వందలాది మంది మట్టలతో ప్రదర్శన జరిపారు. ప్రపంచ శాంతి, రక్షణ కోసం గడియార స్తంభం సెంటర్లో ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో రెవరెండ్ అద్భుత కుమార్, రెవరెండ్ మణికుమార్, మునగాల మన్యం మాస్టారు, సుంకర క్రిస్టఫర్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో ఆయా ప్రార్థనా మందిరాల వద్ద క్రైస్తవ భక్తులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తి గీతాలు ఆలపిస్తూ వీధుల్లో తిరిగి అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అంతర్వేదిపాలెం పరంజ్యోతి చర్చి, సఖినేటిపల్లి, రామేశ్వరం, గొంది, అంతర్వేదిదేవస్థానం ఐపీసీ చర్చి తదితర ప్రార్థనా మందిరాల్లో పండుగ వాతావరం నెలకొంది. ఏసుక్రీస్తు జెరుసలేం పట్టణంలో ప్రప్రథమంగా ప్రవేశించినప్పుడు అక్కడి ప్రజలు ఏసు ప్రభువును గాడిదపై తీసుకుని వస్తూ వివిధ రకాలతో మట్టలతో స్వాగతం పలికారు. దీనిని క్రైస్తవులు మట్టల ఆదివారంగా జరుపుకుంటారు.

కొత్తపేట: స్థానిక ప్రవచన దీవెన సంఘం బిషప్ అబిదెగ్నో ఆధ్వర్యంలో సండే స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హోసన్నా జయము అని నినాదాలు చేస్తూ మట్టలతో ఊరేగారు.

పి.గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో చిన్నారులు ఈతమట్టలతో వీధుల్లో ఊరేగారు. అనంతరం ప్రార్థనలు చేశారు. బెల్లంపూడిలోని ముత్తాయా లూథరన్ చర్చిలోప్రార్థనలు చేశారు.

అల్లవరం: గోడితిప్ప,గోడిలంక, బోడసకుర్రు, కొమరగిరిపట్నం, తుమ్మలపల్లి, దేవగుప్తం గ్రామాల్లో పాస్టర్లు వై.నవీన్‌కుమార్, కేఎస్ ప్రకాష్, మోహన్‌కుమార్, మోజెస్, ఎస్‌కే రాజు, భాస్కరరావు, అడ్డాల దావీద్ ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టలతో ఊరేగారు.

రావులపాలెం: స్థానిక బేతెస్థ ప్రార్థనా మందిరం పాస్టర్లు ఎస్.మేరీప్రియ, ఎస్.లక్ష్మణరాజు ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. మండల పరిధిలోని పలు చర్చిల్లో క్రైస్తవ విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేసి మట్టలతో ఊరేగారు.

ఆలమూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఈత మట్టలకు పువ్వులను ఏర్పాటుచేసి క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ మట్టల ఆదివారం జరుపుకున్నారు. లోక రక్షకుడైన ప్రభువును శిలువ వేయడానికి ముందు వచ్చే ఆదివారాన్ని ఇలా జరుపుకుంటామని క్రైస్తవ మత బోధకుడు యు.జోసఫ్ చెప్పారు.

మామిడికుదురు: మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏసుక్రీస్తు ఎరుషలేం పట్టణానికి ప్రవేశించే సందర్భాన్ని పురస్కరించుకుని కర్జూర మట్టలు గాలిలో ఊపుతూ ఏసుక్రీస్తును స్తుతిస్తారు. మామిడికుదురులోని స్వస్థత పర్వశాలలో పాస్టర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పెదపట్నంలంక, మొగలికుదురు, నగరం, పాశర్లపూడి, మగటపల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చర్చిల్లో క్రైస్తవ భక్తులు పాటలు పాడి సందడి చేశారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి: డీఎస్పీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 24: రౌడీ షీటర్లు వచ్చే ఎన్నికల్లో చెడు ప్రవర్తన మానుకుని సత్ప్రవర్తనతో మెలగాలని రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ సూచించారు. ఆదివారం రామచంద్రపురం సర్కిల్ కార్యాలయం వద్ద డీఎస్పీ బి.రామకృష్ణ రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. రౌడీషీటర్లపై నిరంతరంనిఘా ఉంటుందన్నారు. సత్ప్రవర్తనతో ఉంటామని రౌడీ షీటర్లతో ప్రమాణం చేయించారు. సీఐ దొరరాజు, ఎస్ఐలు కె.సురేష్‌బాబు, ఎస్‌కే జానిబాషా పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి హరీష్‌కు అభినందనలు

అంబాజీపేట, మార్చి 24: టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థిగా గంటి హరీష్‌మాధుర్‌ను పార్టీ అధిష్టానం ప్రకటించడంతో పార్టీ నేతలు అభినందనలు తెలిపారు. హరీష్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, నాయకులు మందా రాజేష్, నేదునూరి పెద్దిరాజు, నేదునూరి రాజకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని డ్రగ్ మాఫియాగా మార్చిన ఘనత జగన్‌దే







అమలాపురం: మాట్లాడుతున్న అయితాబత్తుల ఆనందరావు, రావులపాలెం: మాట్లాడుతున్న బండారు సత్యానందరావు, మండపేట: మాట్లాడుతున్న వేగుళ్ల జోగేశ్వరరావు

ఉమ్మడి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు

అమలాపురం టౌన్, మార్చి 24: జగన్ కనుసన్నల్లోనే రాష్ట్రంలో డ్రగ్ మాఫియా నడుస్తోందని టీడీపీ-జనసేన-బీజేపీ అమలాపురం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు విమర్శించారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు ఏపీలోనే ఉండడం దారుణమన్నారు. అక్రమ సంపాదన కోసం యువతను మత్తుకు బానిసలుచేసి వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం ఆదివారం నియోజకవర్గానికి వచ్చిన ఆనందరావు తొలుత అయినవిల్లి సిద్ధివినాయక ఆలయంలో పూజలు చేశారు. అనంతరం మెట్ల రమణబాబు స్వగృహం వద్ద ఆయనకు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పాపం పండే రోజు దగ్గరపడిందన్నారు. అమలాపురం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అల్లాడ స్వామినాయుడు, దెందుకూరి సత్తిబాబురాజు, చిక్కాల గణేష్, బొర్రా ఈశ్వరరావు, నల్లా స్వామి, మల్లుల పోలయ్య, పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి జయవెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

అమలాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో పేదలు తమ భూములపై హక్కులు కోల్పోతున్నారని టీడీపీ అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ విమర్శించారు. హక్కులు కోల్పోయిన పేదలు ఆత్మన్యూనతా భావంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, పేదల మరణాలకు వైసీపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు లోపాలను ఖండిస్తూ ఆదివారం అమలాపురంలోని పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని సహజవనరులను దోచుకుంటున్న ప్రభుత్వం పేదల భూములు కూడా కాజేస్తోందన్నారు. కార్పొరేట్లకు దోచి పెట్టే ఇటువంటి కుట్రలను ప్రజలంతా తిప్పి కొట్టాలని ఆయన కోరారు. టీడీపీ ప్రభుత్వంతోనే పేదలకు మేలు జరుగుతుందని అందుకు అనుగుణంగా ప్రజలంతా ముందడుగు వేయాలని హరీష్‌మాధుర్ పిలుపునిచ్చారు.

వైసీపీ కనుసన్నల్లోనే డ్రగ్ మాఫియా

రామచంద్రపురం, మార్చి 24: రాష్ట్రంలో వైసీపీ కనుసన్నల్లోనే డ్రగ్‌మాఫియా నడుస్తుందని తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్ రాయ్ ఆరోపించారు. విశాఖపట్టణంలో సీబీఐ అధికారుల విధులకు పోలీసులు ఆటంకం పరచడం వెనుక కారణం ఏమిటని ప్రశ్నించారు. విశాఖలో పట్టుబడిన మత్తు పదార్థాల వెనుక కూనం రామచంద్రరావు అంతా తానై నడిపించారని ఆరోపించారు. వైసీపీ నాయకులు అక్రమ సంపాదన కోసం యువతను డ్రగ్స్‌కు బానిసలు చేసి వారి భవిష్యత్తు అంధాకారం చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ నేత బ్రెజిల్ అధ్యక్షుడికి ట్వీట్ వెనుక కారణాలు వివరించగలరా అన్నారు.

జగన్ కనుసన్నల్లోనే డ్రగ్ మాఫియా

రావులపాలెం, మార్చి 24: జగన్ కనుసన్నల్లోనే రాష్ట్రంలో డ్రగ్ మాఫియా నడుస్తోందని కొత్తపేట నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు ఆరోపించారు. రావులపాలెంలోని టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూనం పూర్ణచంద్రరావు వైసీపీ సీనియర్ నేత కాదా అన్నారు. వైసీపీ ముఖ్య నేత విజయసాయిరెడ్డి బ్రెజిల్ అధ్యక్షుడికి ట్వీట్ చేయడానికి గల కారణాలు చెప్పగలరా అని ప్రశ్నించారు. షైగా పుల రవితేజ, మెర్ల లక్ష్మీపతి, వైట్ల శేషుబాబు,విళ్ల మారుతి, దండు సురేష్‌రాజు, బొంతు రాంబాబు పాల్గొన్నారు.

ప్రజల ఆస్తులు లాక్కునేందుకు జగన్ యత్నం

మండపేట, మార్చి 24: వైసీపీ పాలనలో ప్రజలకు ధన, మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ ఆదేశాలతో ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల స్థిరాస్తులను దోచుకుంటున్నారన్నారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరానికి చెందిన చేనేత కార్మికుడు పాలా సుబ్బారావుకు చెందిన మూడెకరాల పొలాన్ని వైసీపీ నేతలు కాజేసిన నేపథ్యంలో ఆ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనను వేగుళ్ల గుర్తుచేశారు. వచ్చేఎన్నికల్లో జగన్ పాలనకు చరమగీతం పాడాలన్నారు. టీడీపీ నేతలు మల్లిపూడి గణేష్, వాదా ప్రసాద రావు, ఉంగరాల రాంబాబు, కాళ్లకూరి శ్రీను, చింతలపూడి సత్తిబాబు, గుండు తాతరాజు, బుజ్జి, అప్పన్నబాబు పాల్గొన్నారు.

ఏపీ బాగుపడాలంటే బాబు సీఎం కావాలి

ఏపీలో పాలన గాడి తప్పిందని, రాష్ట్రంలో అభివృద్ధిలో పరుగులు పెట్టాలంటే సీఎంగా చంద్రబాబునాయుడు వస్తేనే సాధ్యమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలో టీడీపీ 2,3,4,5వార్డుల ఇన్‌చా ర్జీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో సీఎం నుంచి మంత్రులు, అధికారులు ప్రజాధనం దోచుకోవటం దాచుకోవటం తప్ప చేసిందేమి లేదన్నారు. టీడీపీ జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పిలుపు నిచ్చారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, వాదా ప్రసాదరావు, యరమాటి గంగరాజు పాల్గొన్నారు.

క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ముమ్మిడివరం, మార్చి 24: క్షయవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రాథమిక స్థాయిలోనే మందులు వాడడం ద్వారా ఆ ఆ వ్యాధి నుంచి బయట పడవచ్చునని వైద్యాధికారిణి యోగితాలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ప్రారంభించిన ర్యాలీని వైద్యాధికారిణి యోగితాలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. చేయిచేయి కలుపుదాం క్షయ వ్యాధిని దూరం చేద్దామంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంపూర్ణ, ఫార్మశిస్ట్ సత్యనారాయణ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపేట: ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా కొత్తపేట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, ఐసీటీసీ, ఆర్ఎన్‌టీసీపీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. డాక్టర్లు వంశీ, దివ్య, వీరబాబు, ప్రియాంక, సిబ్బంది ఎం.దుర్గాప్రసాద్, ఆర్‌కే రెడ్డి, దేవీజనని పాల్గొన్నారు.

కె.గంగవరం: క్షయ వ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని కుందూరు ఆసుపత్రి వైద్యాధికారిణి రత్నసుధ అన్నారు. ఆసుపత్రిఆవరణలో ప్రత్యేకకార్యక్ర మాలు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీచేసి క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కలిగించారు. వైద్యాధికారి ప్రతాప్ నాయుడు, క్షయవ్యాధి నివారణ ప్రోగ్రామ్ సూపర్‌వైజర్ కడలి వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

మామిడికుదురు, మార్చి 24: మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1971-76వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. స్కూల్ ఆవరణలో వారంతా కలుసుకుని జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందోత్సాహాల మధ్య గడిపారు. పూర్వవిద్యార్థులు కె.వనజాకుమారి, సర్పంచ్ అడబాల తాతకాపు, సజ్జాద్‌హుస్సేన్, భజరంగ్‌లాల్ బియానీ, మొల్లేటి సత్యనారాయణమూర్తి, నయినాల సుబ్బలక్ష్మి, కొల్లాబత్తుల ఆనందరావు, నయినాల నరసింహారావు, చిక్కం రాంబాబు, అన్నంనీడి తిరుపతిరావు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశం

ఐ.పోలవరం,మార్చి24:వాకాడివారిమెరకలో ఆదివారం టీడీపీ,జనసేన ఆత్మీయ సమావేశం జరిగింది. ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బుచ్చిబాబును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని టీడీపీ, జనసేన కార్యకర్తలు ప్రకటించారు. బుచ్చిబాబు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావును సన్మానించారు. సాగిరాజు సూరిబాబురాజు, మామిడాల బాబులు, బులికాసులు, మామిడాల బుజ్జి, కూనపరెడ్డి సత్యనారాయణ, వాకాడి ధనరాజు, ఉద్దిశ ధనరాజు, కాకర్లపూడి రాజేష్, పిన్నమరాజు శివరాజు, మద్దింశెట్టి కుమార్ పాల్గొన్నారు.

అయినవారంతా కాదనుకున్నా.. పేదకు అంత్యక్రియలు నిర్వహించిన ఎఫ్‌టీఎస్

అమలాపురం రూరల్, మార్చి 24: అయినవారంతా వదిలేసిన అనాథకు అన్నీ తామై ఫ్రీ టైమ్ సర్వీస్ (ఎఫ్‌టీఎస్) బృందం ఆదివారం అంత్యక్రియలు నిర్వహించింది. బండారులంక గ్రామానికి చెందిన కొండా శ్రీను(40) ప్రధానరహదారి పక్కనే ఏళ్ల తరబడి కాలం వెళ్లదీస్తున్నాడు. అతడికి ఎఫ్‌టీఎస్ సభ్యులు ప్రతిరోజూ ఆహారం అందిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నంఎఫ్‌టీఎస్ వ్యవస్థాపకుడు తులా రాంబాబు ఆహార పొట్లం ఇచ్చేందుకు రాగా అప్పటికే మండుటెండలో కొనఊపిరితో కొట్టుకుంటున్న శ్రీనును నీడకు చేర్చారు. కొద్ది క్షణాల వ్యవధిలో ఊపిరి వదిలేశాడు. అయినవారికి సమాచారం ఇచ్చారు. ఎవరూ రాకపోవడంతో ఎఫ్‌టీఎస్ సభ్యులే అంబులెన్సు తీసుకువచ్చి మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు జరిపించారు.

సుభాష్ విజయానికి కృషి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి24:టీడీపీ, జనసేన, బీజేపీఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ విజయానికి కృషి చేయాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలో పోలిశెట్టి చంద్రశేఖర్‌ను సుభాష్ కలిశారు. పలు అంశాలపై ఇద్దరు చర్చించారు. టీడీపీ నాయకులు రాయపురెడ్డి సూరిబాబు, జనసేన పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అమలాపురం టౌన్, మార్చి 24: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్దాలవారిపేట, నారాయణపేట, మండలంలో రోళ్లపాలెం, పేరూరు శివారు తోట్లపాలెం పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ ఎం.మహేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. సీఐ కె.క్రిస్టఫర్, సిబ్బంది పాల్గొన్నారు.

పలు మండలాల్లో భారీగా టీడీపీలోకి చేరికలు







ద్రాక్షారామ: వాసంశెట్టి సుభాష్ సమక్షంలో, కాట్రేనికోన: దాట్ల బుచ్చిబాబు సమక్షంలో, ఆలమూరు: బండారు సత్యానందరావు సమక్షంలో టీడీపీలోకి చేరికలు

పార్టీ నాయకుల సమక్షంలో చేరికలు

ద్రాక్షారామ, మార్చి 24: వెలంపాలెంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు ఆదివారం టీడీపీలో చేరారు. ఏపీ ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ డైరెక్టరు, వెలంపాలెం సర్పంచ్ టేకుమూడి సుజాత, మంత్రి వేణుగోపాలకృష్ణ ప్రధాన అనుచరుడు వైసీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు వాసంశెట్టి లావణ్య, వెలంపాలెం పీఏసీఎస్ చైర్మన్ పలివెల నాగరాజు, నాగలమూడి సత్యనారాయణ,వార్డుసభ్యులు నురుకుర్తి నాగేశ్వరరావు, బొక్కా శ్రీను, టేకి శ్రీనివాస్, పడమటి శంకరం, పెయ్యల సుబ్రహ్మణ్యం, పువ్వల అప్పన్న, నెరగానిరాజేష్, ఏరుపల్లి మాజీ సర్పంచ్ చిల్లా గోపాలకృష్ణ, ఉండూరు మాజీ సర్పంచ్ రజని, మరో 200మంది వైసీపీకి రాజీనామా చేశారు. వీరంతా వెలంపాలెంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి సుభాష్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు రాయపురెడ్డి సూరిబాబు, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ తదితరులు పాల్గొన్నారు.

చోడవరానికి చెందిన వంద మంది టీడీపీలో చేరిక

చోడవరానికి చెందిన వంద మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. రామచంద్రపురంలో లయన్స్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో కోటి రాంబాబు, జుత్తుక వెంకట్రావు, జత్తుక అజిల్, గెద్దం చిన్నబ్బులు, పలివెల శ్రీ, అనుసూరి కృష్ణార్జున్, బుంగ బాలకృష్ణ, ఈతకోట రాఘవ, తాతపూడి మణిరాజు, చింతపల్లి త్రిమూర్తులుతో పాటు 100మంది టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కొత్తపల్లి శ్రీను ఆధ్వర్యంలో టీడీపీ అభ్యర్థి సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరారు. మాజీ ఏఎంసీ చైర్మన్ గిరిగిపాటి సూర్యనారాయణ పాల్గొన్నారు.



మండపేట: వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలోకి చేరికలు

చింతలూరుకు చెందిన

ఆలమూరు, మార్చి 24: చింతలూరుకు చెందిన పలువురు నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేశారు. మాజీ ఉపసర్పంచ్ పెద్దింటి మంజులతో పాటు పలువురికి కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు కండువాలు వేసి స్వాగతించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి విజయానికి పూర్తిస్థాయిలో కృషిచేస్తామని వారు చెప్పారు. కార్యక్రమంలో చింతలూరుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

కాట్రేనికోన, మార్చి24: కాట్రేనికోనపంచాయతీవేట్లపాలెంలో పలువురు వైసీపీ కార్యకర్తలు ఆదివారం ముమ్మిడివరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. బూలవారిపేటలో 20మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలోచేరారు. జిల్లెళ్ళవారిపేటలో గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో 30మంది వైసీపీనుంచి టీడీపీలోకి వచ్చారు. వీరిని బుచ్చిబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కేశవరానికి చెందిన

మండపేట,మార్చి24: కేశవరానికి చెందిన పలువురు గ్రామ టీడీపీ అధ్యక్షుడు కర్రి తాతారావు నేతృత్వంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. ఉండమట్ల మణికంఠ, షేక్ వీరబాబు, మస్తాన్, కోలంకి రమేష్, తూము మణికంఠ, బోనగిరి గంగరాజు తదితరులు పార్టీలోచేరగా వేగుళ్లకండువాలేసి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, అరిగెల మణికంఠ, గుడ్ల ఈశ్వరరావు, పాల్గొన్నారు.

దళితులను సంక్షేమానికి.. అభివృద్ధికి దూరం చేసిన జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలు



హరీష్‌మాధుర్‌ను అభినందిస్తున్న ఎస్సీసెల్ రాష్ట్ర, జిల్లా నాయకులు

అమలాపురం టౌన్, మార్చి 24: ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి, ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు(బాలు) విమర్శించారు. దళితులను అభివృద్ధికి, సంక్షేమానికి దూరం చేసిన వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో దళితుల అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం పాటుపడ్డ చంద్రబాబును సీఎంను చేసేందుకు దళితులంతా కృషి చేయాలన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ అమలాపురంలోక్‌సభ ఉమ్మడి అభ్యర్థిగా గంటి హరీష్‌మాధుర్‌ను ప్రకటించడంతో ఆదివారం అమలాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన్ను ఎస్సీసెల్ రాష్ట్ర, జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.హరీష్‌మాధుర్‌ను గెలిపించేందుకు ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు అన్నివర్గాలవారు కృషి చేయాలని బాలు పిలుపునిచ్చారు. ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుట్టుగుళ్ల కిశోర్, రాష్ట్రఅధికార ప్రతినిధి గెడ్డం నరసింహా, హెచ్‌ఆర్డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు చిన్నం బాలవిజయరావు, పెదపూడి శ్రీనివాసరావు, లీగల్‌సెల్ అధ్యక్షుడు బడుగు భాస్కరజోగేష్, గుమ్మడి వెంకటేశ్వరరావు, గోనిపాటి రాజు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులతో ఆనందరావు

అమలాపురం టౌన్, మార్చి 24: బీజేపీ జిల్లా కార్యాలయాన్ని అమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు ఆదివారం సందర్శించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ సోంబాబులకు దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఎన్డీయే మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని సూచించారు. బీజేపీ నాయకులు దూరి రాజేష్, కొండేటి ఈశ్వర్‌గౌడ్, వెంపరాల భాస్కరశాస్త్రి, యర్రమిల్లి పాండురంగారావు, అరిగెల తేజ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

రాయవరం,మార్చి24: సార్వత్రికఎన్నికల్లో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు నదురుబాద, వి.సావరం, వెదురుపాక గ్రామాల్లో ఆదివారం పోలీసులు కవాతునిర్వహించారు. రాయవరంలో ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ మాట్లాడుతూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, ఎస్ఐ జి.నరేష్, రిజర్వు పోలీసులు పాల్గొన్నారు.

ప్రత్యేక అజెండాతో ఎన్నికలకు సిద్ధం : జంగా గౌతమ్

మామిడికుదురు, మార్చి 24: కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక అజెండాను రూపొందించి దేశంలో ఎన్నికలకు సిద్ధమవుతుందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పేర్కొన్నారు. మామిడికుదురులో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటకలో ఆరు గ్యారంటీలు, తెలంగాణలో ఐదు గ్యారంటీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అదే స్ఫూర్తితో దేశంలో ముందుకు సాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవర్తిస్తున్న తీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నరేంద్రమోదీ పాలనతో నిరుద్యోగం పెరిగిందని, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధిఅవకాశాలు కల్పించే దిశగా పార్టీ కార్యాచరణ చేస్తున్నట్టు తెలిపారు. మాచవరపు శివన్నారాయణ, అప్పన శ్రీరామకృష్ణ, నీతిపూడి బాలసత్యనారాయణ, గెడ్డం వెంకటేశ్వరరావు, బత్తుల సురేష్‌బాబు, వాణరాశి దుర్గారావు, వాణరాశి దొరబాబు పాల్గొన్నారు.

ఐదు మద్యం సీసాలు స్వాధీనం

అల్లవరం,మార్చి24: అల్లవరంలో ఎంపీడీవో టీఎస్ఎస్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఆదివారం ఫ్లయింగ్‌స్క్వాడ్ వాహనాలను తనిఖీ చేసింది. తెలంగాణకు చెందిన లీటరు పరిమాణం గల ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలో ఎంఈవో-2 ఎస్.ఏడుకొండలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

ముమ్మిడివరం, మార్చి 24: అదనపు కట్నంపై ఓ మహిళ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని దొమ్మేటివారిపాలేనికి చెందిన దొంగ మల్లేశ్వరికి రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన కిరణ్‌కుమార్‌తో 2022లో వివాహమైంది. కట్న కానుకలు ఇచ్చారు. అయితే అదనపు కట్నం తీసుకురమ్మని భర్త కిరణ్‌కుమార్, మరిది నానాజీ, ఆడపడుచు హరిణిలు వేధింపులకు గురిచేస్తున్నారని మల్లేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌హెచ్‌వో జి.భైరవస్వామి కేసు దర్యాప్తు చేపట్టారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

అంతర్వేది, మార్చి 24: జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ అంతర్వేదిపాలెంలో పల్లపోతు హనుమంతరావు(బంగారం) ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి ఓటును గాజు గ్లాసు గుర్తుపైవేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆదివారం ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం మత్స్యకారులతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లింగోలు పెద్దబ్బులు, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, కుసుమ నాని, పెచ్చెట్టి చక్రి, గంటా నాయుడు, ఉండపల్లి అంజి, ఎమ్మార్పీఎస్ నాయకులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ పూజలు

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఉమ్మడి అభ్యర్థి, విశ్రాంత ఐఏఎస్ అధికారి దేవ వరప్రసాద్ ఆదివారం దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందించారు. దిరిశాల బాలాజీ, లింగోలు పెద్దబ్బులు, పినిశెట్టి బుజ్జి, పొన్నాల ప్రభ, గుబ్బల ఫణి, ఎంపీటీసీ బైరా నాగరాజు, కుసుమ నాని, వనమాలి మూలాస్వామి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

డోలోత్సవం

అంతర్వేది, మార్చి 24: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో రాజావారి వీధిలో ఉన్న డోలా మండపం వద్ద డోలా పౌర్ణమిని ఆదివారం నిర్వహించారు. తొలుత అర్చకులు స్వామి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులుచేసి డోలోత్సవ పూజా కార్యక్రమాలు జరిపారు. ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఎంపీటీసీ బైరా నాగరాజు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

అమలాపురంరూరల్, మార్చి24: బండారులంక బిళ్లవారి వీధిలో శ్రీశ్రీనివాసా బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో శ్రీపద్మావతి అలిమేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణానికి చింతపట్ల కృష్ణరామమోహనరావు-విజయలక్ష్మి దంపతులు ఆదివారం శంకుస్థాపనపూజలునిర్వహించారు. శ్రీలక్ష్మీగణపతి, సుదర్శన హోమాలు జరిగాయి. మంత్రి పినిపే విశ్వరూప్, మాజీ జడ్పీటీసీ కుడుపూడి బాబు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, పందిరి శ్రీహరి, నాయకులు సర్పంచ్ పెనుమాల సునీత, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు అంకం హిమభారతి, గుత్తుల జానకీలక్ష్మి, దంగేటి బుల్లబ్బులు, ఉప్పుగంటి భాస్కరరావు, కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి, సరెళ్ల రామకృష్ణ, బాలమిత్ర సంఘం ప్రతినిధులు,భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

రావులపాలెం, మార్చి 24: స్థానిక అలిమేలు మంగ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పుత్రకామేష్టి యాగం, అశ్వవాహనోత్సవం జరిపారు. అర్చనలు, అభిషేకాలు, అష్టోత్తర, సహస్ర నామ పూజల్లో భక్తులు, గోవిందమాలధారులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

రాయవరం, మార్చి 24: పసలపూడిలో షిర్డీ సాయిబాబా ఆలయ 30వ వార్షికోత్సవ పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాబా ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అభిషేకాలు అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్రి దేవారెడ్డి, గంగిరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, పోతంశెట్టి వెంకటరమణ భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా దండు మారెమ్మ తీర్థం

రాయవరం, మార్చి 24: వెంటూరు గ్రామస్థుల ఇలవేల్పు దండు మారెమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర పురస్కరించుకుని అమ్మవారి ప్రతిరూపాలు గరగలను గ్రామోత్సవం నిర్వహించారు. వెంటూరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దింట్లమ్మ తీర్థ మహోత్సవాలు

అంతర్వేది, మార్చి 24: కేశవదాసుపాలెం గ్రామం మెండుపాలెం చినకొల్లేరులో వెలసి ఉన్న శ్రీపెద్దింట్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించి విందు భోజనాలు చేశారు. క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులు సేవలు అందించారు.

యానాం వెంకన్నకు చక్రస్నానం

యానాం, మార్చి 24: యానాం భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి చక్రతీర్థం, చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గౌతమి గోదావరిలో స్వామివారికి చక్రస్నానం చేయించారు. మద్దింశెట్టి సత్తిరాజు కుమారుడు ప్రసాద్ ఉత్సవదారులుగా ఉన్న తెప్పతెన్నాల ఉత్సవం, చంద్రోత్సవ వాహనంపై స్వామివారిని ఊరేగించారు.

పవనన్న వదిలిన బాణాన్ని: సుభాష్



సత్యవాడలో తెలుగుదేశం పార్టీలో చేరిన, జనసేన మద్దతుదారులతో వాసంశెట్టి సుభాష్

కె.గంగవరం, మార్చి24: రామచంద్రపురం నియోజకవర్గం నుంచి తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా తాను పవనన్న వదిలినబాణాన్ని అని వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం సత్యవాడలో తోట వెంకన్న ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా సత్యవాడ వచ్చిన సుభాష్‌కు జనసేన నాయకులు భారీగా తరలివచ్చి స్వాగతం పలికి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా సుభాష్ వారిని ఉద్దేశించి మాట్లాడారు. జనసేనకు సత్యవాడ అడ్డా అని, ఇక్కడ నుంచి పూర్తి మెజార్టీ ఆశిస్తున్నానని అన్నారు. గ్రామంలోని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు తన విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ సీనియర్ నాయకులు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, కొత్తపల్లి మొరార్జీ, సలాది రమేష్, మేడిశెట్టి రవికుమార్, చొల్లంగి ఎదుర్లయ్య, చింతపల్లి వీరభద్రరావు, పేకేరు బాబ్జీ, శీరెడ్డి సత్తిబాబు, గన్ని శ్రీను, జగతా రమణ, జనసేన నాయకులు దేవరపల్లి చక్రి, సలాది వెర్రిబాబు, తోట వెంకన్న, చిన్నబాబు, తోట ఆదినారా యణ, సలాది బ్రహ్మాజీ, సలాది ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యపాన రహిత సమాజం కోసం ఓటేయండి

అమలాపురంటౌన్, మార్చి24: వచ్చే ఎన్నికల్లో మద్యపాన రహిత సమాజం కోసం ఓటు హక్కును వినియోగించుకోవాలని, మద్యపాన నిషేధానికి కట్టుబడి ఉండే రాజకీయ పార్టీలకే ఓట్లు వేయాలని మద్యపాన ప్రచార వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు డాక్టర్ ఎం.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పట్టణంలోని వివిధ పార్కుల్లో తన బృందంతో కలిసి పర్యటించి మద్యపానానికి వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను పంచారు. ఎన్నికలు వస్తున్నాయంటే చాలు గ్రామాలను మద్యంతో ముంచెత్తుతున్నారని విమర్శించారు. వివిధ సంఘాల నాయకులు పెయ్యల దుర్గాప్రసాద్, కారెం వెంకటేశ్వరరావు, కె.సత్యశ్రీధర్, ఆర్.కుమార్, వై.శ్రీనివాస్, పరమట రాంప్రసాద్ పాల్గొన్నారు.

మోటారుసైకిల్ ఢీకొని వ్యక్తి మృతి

కొత్తపేట, మార్చి24: కొత్తపేటబాబానగర్‌కాలనీకి చెందిన కర్రి మాచరయ్య (39) బోడిపాలెం వద్ద రోడ్డు దాటుతుండగా అమలాపురం వైపు నుంచి మోటారుసైకిలుపై వస్తున్న ముగ్గురు యువకులు ఢీకొట్టారు. మాచరయ్య, ఆకాష్, రాములకు గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మాచరయ్య శనివారం రాత్రి మృతిచెందాడు. శ్రీనుకు స్వల్ప గాయలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు.

చేనేత కార్మికుల మృతికి కొవ్వొత్తులతో నిరసన

మలికిపురం, మార్చి 24: కడపలో ల్యాండ్ టైటిలింగ్ పేరుతో జగన్‌రెడ్డి చట్టం చేస్తున్న మూకుమ్మడి హత్యలకు నిరసనగా ఆదివారం లక్కవరంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శ చేశారు. టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.